మంత్రి పొంగులేటి పర్యటనలో
పోలీసుల అత్యుత్సాహం

దర్గాగా పార్టీ నాయకులకు ఎంట్రీ... అధికారులకు అవమానం

సీఐ వాహనంలో అధికార పార్టీ నాయకుడికి అందలం

సీఐ వాహనంలో కూర్చున్న అధికార పార్టీ నాయకుడు

భద్రాచలం, నవంబర్ 23 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో శనివారం జరిగిన రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటనలో పోలీసులు అత్యుత్సాహం చూపారు. సాక్షాత్తు సీఐ వాహనంలో ఓ అధికార పార్టీ నాయకుడిని తిప్పుతూ కనిపించారు. మంత్రి అధికారిక పర్యటన కావడంతోపాటు భద్రాచలం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన రివ్యూ మీటింగ్‌కు నియోజకవర్గంలోని వివిధశాఖల అధికారులు చేరుకున్నారు. ఈక్రమంలో పోలీసులు అధికార పార్టీ నాయకులను దర్జాగా లోనికి పంపుతూ అధికారులను మాత్రం అక్కడే నిలిపివేసి అవమానానికి గురిచేశారు. అంతే కాకుండా మీరు ఇంత లేటయితే ఎలా అంటూ నిలదీశారు. దీంతో అసహనం చెందిన అధికారులు మేమంతా మంత్రితో పాటు డబుల్ బెడ్రూం ఇళ్లను పరిశీలించడానికి వెళ్లామని పోలీసులకు సమాధానమిస్తూ విస్తుపోయారు. ఒకరిద్దరు అధికారులు పోలీసులపై సీరియస్ అవుతూ వారివద్ద ఉన్న ఐడీ కార్డులను చూపించి మీటింగ్‌హాల్‌కు వెళ్లారు. ఇదిలాఉండగా ఓ అధికార పార్టీ యువ నాయకుడు సాక్షాత్తు సీఐ వాహనంలో మంత్రి పర్యటన సమయమంతా అందులోనే గడిపాడు. ఏదేమైనా మంత్రి పర్యటనలో పోలీసులు అధికార పార్టీ నాయకులకు ఇచ్చిన మర్యాద అధికారులకు ఇవ్వకపోగా అవమానించడంతో పోలీసుల తీరుపై మండిపడుతున్నారు.

గౌడ సంఘం వన సమారాధన

వన సమారాధనలో మెచ్చా నాగేశ్వరరావు

దమ్మపేట రూరల్, నవంబర్ 23: మండలంలోని నాగుపల్లిలో శనివారం గౌడ సంఘం ఆధ్వర్యంలో వన సమారాధన జరిగింది. మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. గౌడలకు బీఆర్ఎస్ ప్రభుత్వం సముచిత స్థానం కల్పించిందన్నారు. హైదరాబాద్‌లో నీరా కేంద్రం ఏర్పాటు చేసి కుల వృత్తిని ప్రోత్సహించిందన్నారు. సంఘం బాధ్యులు కందిమళ్ల లక్ష్మినారాయణ, సర్వేశ్వరరావు, భాస్కర్‌రావు, చరణ్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడాపోటీల్లో మనోళ్ల ప్రతిభ

విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులతో విద్యార్థులు

అశ్వారావుపేట, నవంబర్ 23: హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 19 నుంచి 23 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. 11 వ్యవసాయ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. బాలికల విభాగంలో రచన, బాలుర విభాగంలో అనిల్ కుమార్ వ్యక్తిగత అథ్లెటిక్స్ చాంపియన్‌గా నిలిచారు. బాలికల విభాగం టెన్నీకాయిట్‌లో ఎన్.నందిత, కె.శ్రీలేఖ, ఆర్.కళ్యాణి; టేబుల్ టెన్నిస్‌లో పి.అమృతవర్ష, వై.యమున, హెచ్.చిన్నారి విజేతలుగా నిలిచారు. చెస్ చాంపియన్‌గా ఇషాద్లైసిన్ గెలుపొందారు. బాలుర విభాగం టేబుల్ టెన్నిస్‌లో కె.అబ్రహం, ఆర్.చంద్రశేఖర్, వి.బ్రహ్మాజ్ఞ విజయం సాధించారు. ఆర్.రచన.. 100, 200,400 మీటర్ల పరుగు పందెంలో, లాంగ్ జంప్‌లో ప్రథమ స్థానం సాధించారు. వీరిని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జె.హేమంత్ కుమార్, ఓఎస్‌ఏ డాక్టర్ ఎస్.మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ పి.ఝాన్సీరాణి అభినందించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు నెరవేర్చాలి

మాట్లాడుతున్న షేక్ యాకుబ్ షావలి

ఇల్లెందు, నవంబర్ 23: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలను పెంచాలన్న డిమాండుతో డిసెంబర్ 10వ తేదీ వరకు దశలవారీగా ఆందోళలు నిర్వహిస్తున్నట్లు ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ అనుబంధం) నాయకుడు, టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ యాకుబ్ షావలి చెప్పారు. యూనియన్ ఇల్లెందు బ్రాంచి కమిటీ సమావేశం కె.వెంకట్ అధ్యక్షతన స్థానిక ఎల్లన్న భవనంలో శనివారం జరిగింది. షేక్ యాకుబ్ షావలి మాట్లాడుతూ.. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలను ఏడేళ్లుగా పెంచలేదన్నారు. సమాన పనికి సమాన వేతనంగానీ, కోల్ ఇండియాలో అమలువుతున్న విధానంలోగానీ సింగరేణిలో అమలయ్యేలా నిర్ణయం తీసుకోవాలన్న డిమాండుతో డిసెంబర్ 10 వరకు దశలవారీ ఆందోళన చేపడుతున్నట్లు చెప్పారు. పల్లెల వెంకటేశ్వర్లు, వేముల గురునాథం, కొత్తపల్లి రఘు, మూడు సంజీవ్, ధనాల శామంత్, రామకృష్ణబాలు తదితరులు పాల్గొన్నారు.

నారచీరెల ప్రాంతాన్ని సందర్శించిన తహసీల్దార్

పర్ణశాల, నవంబర్ 23: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల నారచీరెల ప్రాంతాన్ని దుమ్ముగూడెం తహసీల్దార్ అశోక్ కుమార్ శనివారం సందర్శించారు. పర్ణశాల గ్రామానికి చెందిన బానోత్ భవిత నారచీరెల ప్రాంతం వద్ద శీతల పానీయాల షాపు పెట్టుకొని జీవనం సాగిస్తున్నామని, అదే గ్రామానికి చెందిన చింతా శ్రీధర్ తన షాపులో ఉన్న సామన్లు బయటికి పడవేసి దుర్భాషలాడి అద్దె చెల్లించమంటున్నాడని, భూమి తనదేనని, ఖాళీ చేయమంటున్నాడంటూ అతనిపై ఫిర్యాదు చేసినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. ఆ ఫిర్యాదుపై విచారణ జరిపి నారచీరెల ప్రాంతం వద్ద ఉన్న భూమిని సర్వే చేసి రికార్డులను పరిశీలించి నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరువకావాలి

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

భద్రాచలం, నవంబర్ 23: ప్రభుత్వం ప్రవేశపెడుతున్న వివిధ సంక్షేమ పథకాలు ప్రజలకు అమలయ్యేలా కృషిచేయాలని అధికారులను రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. శనివారం పట్టణంలోని కేకే ఫంక్షన్‌హాల్‌లో జరిగిన నియోజకవర్గ స్థాయి అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడారు. ఏజెన్సీ మండలాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. భద్రాచలంలో డంపింగ్‌యార్డు నిర్మాణం పూర్తయినందున మిషనరీని అమర్చి 15 రోజుల్లో ప్రారంభించాలని అన్నారు. మారుమూల గ్రామాల్లో ఐటీడీఏ ఇంజినీరింగ్ శాఖ ద్వారా చేపట్టిన రోడ్లు పూర్తిచేయాలని పేర్కొన్నారు. తొలుత మంత్రి భద్రాచలం ఏఎంసీ కాలనీలో పర్యటించి నిర్మాణం పూర్తయి ఖాళీగా ఉన్న ఇందిరమ్మ, డబుల్‌బెడ్‌రూం ఇళ్లను పరిశీలించారు. ఆ ఇళ్లను డిసెంబర్ నాటికి పూర్తిచేసి లబ్దిదారులకు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఎంపీ బలరాంనాయక్, భద్రాచలం, అశ్వారావుపేట ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, జారె ఆదినారాయణ, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్, ఏపీవో డేవిడ్‌రాజ్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాస్, ఐటీడీఏ డీడీ మణెమ్మ, ఈఈ తానాజీ, అధికారులు పాల్గొన్నారు.

ఆదివాసీల ఆచారాలు కాపాడుకోవాలి

ఆదివాసీల ఆచార వ్యవహారాలు, సంస్కృతి, సాంప్రదాయాలను అంతరించిపోకుండా కాపాడుకోవడమే కాకుండా పాతకాలం ఆదివాసీ వంటకాలు మర్చిపోకుండా నేటికి ఆచరించడం చాలా సంతోషకరమని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం పర్యటనలో భాగంగా హౌసింగ్ గెస్ట్‌హౌస్‌కు చేరుకున్నారు. మంత్రి పొంగులేటితో పాటు ఎంపీ బలరాంనాయక్‌లకు ఐటీడీఏ ఏపీవో డేవిడ్‌రాజ్ ఘనస్వాగతం పలికారు. అనంతరం గెస్ట్‌హౌస్‌లో ఆదివాసీ గిరిజన మహిళలు తయారుచేసిన ఆదివాసీ వంటకాలను ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, జారె ఆదినారాయణలతో కలిసి రుచిచూసి సంతృప్తి వ్యక్తం చేశారు. గిరిజన మహిళలు తయారుచేసిన ఆదివాసీ వంటకాలు మైమరపింపచేశాయని వారిని ప్రత్యేకంగా అభినందించారు. డీసీఎంఎస్ చైర్మన్ శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని, కలెక్టర్ జితేష్ వి పాటిల్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, అధికారులు పాల్గొన్నారు.

వరికోతకు వేళాయే..!

ఆళ్లపల్లి, నవంబర్ 23: మండలంలోని పలు గ్రామాల్లో వరికోతలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం అక్కడక్కడ కోతలు ప్రారంభం కాగా, మరో వారం రోజుల్లో జోరందుకునున్నాయి. మండలంలో 12 పంచాయతీల్లో 48 గ్రామాలకు రెండు క్లస్టర్‌లున్నాయి. వీటి పరిధిలో 3,590 ఎకారాల్లో రైతులు వరి సాగుచేశారని అధికారులు పేర్కొంటున్నారు. హర్వెస్టర్ల సాయంతో కోతలు కోసి కల్లల్లో ఆరబెడుతున్నారు. మరికొందరు ఇళ్లకు తరలించి ఆరబెడుతున్నారు. హర్వేస్టర్‌కు ఎకరానికి రూ.2,400లు చెల్లిస్తున్నారు. మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ ప్రారంభించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారమని రైతులు పేర్కొంటున్నారు.

హర్వెస్టర్‌తో పొలం కోస్తున్న దృశ్యం

అన్నపురెడ్డిపల్లి ప్రత్యేకాధికారిగా అరుణ భారతి

అన్నపురెడ్డిపల్లి, నవంబర్ 23:అన్నపురెడ్డిపల్లి మండల ప్రత్యేకాధికారిగా జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ అరుణభారతి శనివారం విధుల్లో చేరారు. ఆమెకు మండల అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

ఇళ్ల స్థలాలకు వినతి

అశ్వారావుపేట రూరల్, నవంబర్ 23: మండలంలోని ఎర్రగుంటపల్లి సమీపంలో వినాయకపురం వద్ద ప్రభుత్వ స్థలంలో పేద గిరిజనులు వేసుకున్న గుడిసెలను అటవీ అధికారులు తొలగించడంతోపాటు కేసులు నమోదు చేశారని ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు క్యాంప్ కార్యాలయంలో సీపీఐ- ఎమ్ఎల్ (మాస్‌లైన్) నాయకులు రంగారెడ్డి, గోకినపల్లి ప్రభాకర్ శనివారం ఫిర్యాదు చేశారు.

కరపత్రం ఆవిష్కరణ

చండ్రుగొండ, నవంబర్ 23: డిసెంబర్ 1న హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే మాలల సింహగర్జన సభ కరపత్రాన్ని శనివారం స్థానిక ప్రధాన సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద మండల అధ్యక్షుడు బడుగు శంకర్ ఆవిష్కరించారు. నాయకులు దాసరి రామారావు, తలారి నాగరాజు, తంబళ్ల మంగయ్య, రాంబాబు, కాంతారావు, చిన్న ఎల్లయ్య పాల్గొన్నారు.

లక్ష్మీదేవిపల్లి, నవంబర్ 23: సేవాలాల్ సేన ప్రజారగ్ జోశ్ యాత్ర కరపత్రాన్ని మండలంలోని కారుకొండ రామవరం పంచాయతీ హోలీతండాలో శనివారం సేవాలాల్ సేన మండల ప్రధాన కార్యదర్శి మాలోత్ రాజు నాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొట్టి వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు.

తిప్పనపల్లి తండాలో మంచినీటి తిప్పలు

చండ్రుగొండ, నవంబర్ 23: మండలంలోని తిప్పనపల్లి తండాకు మిషన్ భగీరథ నీళ్లు మూడు రోజులుగా అందడం లేదు. కిలోమీటన్నర దూరం నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి యూజీ తరగతులు

లక్ష్మీదేవిపల్లి, నవంబర్ 23: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ యూజీ తరగతులు ఈ నెల 24న ప్రారంభమవుతాయని రామచంద్ర కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వనజ, అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ వెంకట్ ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి, మూడవ, ఐదవ సెమిస్టర్ విద్యార్థులు హాజరుకావాలని పేర్కొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ఇల్లెందు రూరల్, నవంబర్ 24: మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని హెడ్ కానిస్టేబుల్ లక్ష్మారెడ్డి అన్నారు. మాదక ద్రవ్యాలపై మండలంలోని బొజ్జాయిగూడెం ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడతూ.. మాదక ద్రవ్యాలకు అలవాటైతే జీవితాన్ని కోల్పోయినట్లేనని హెచ్చరించారు. బాగా చదువుకుని, ఉన్నత స్థాయికి చేరుకుని తల్లితండ్రులకు మంచి పేరు తేవాలని కోరారు.

రిటైర్డ్ కార్మికులకు దీపావళి బోనస్

కొత్తగూడెం సింగరేణి, నవంబర్ 23: సింగరేణి రిటైర్డ్ కార్మికులకు రూ.18.27 కోట్ల దీపావళి బోనస్‌ను ఈ నెల 27న కార్మికుల ఖాతాల్లో జమ అవుతుందని సీఎండీ బలరాం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి అక్టోబర్ 24 మధ్య రిటైర్ అయిన కార్మికులకు దీపావళి బోనస్ విడుదల చేస్తున్నట్లు వివరించారు. ఇది ఈ నెల 27న బ్యాంక్ ఖాతాల్లో జమ అవుతుందని పేర్కొన్నారు. రిటైర్డ్ కార్మికులు 2,754 మందికి గరిష్టంగా రూ.93,750 చొప్పున మొత్తం రూ.18.27 కోట్లు విడుదల చేసినట్లు వెల్లడించారు.

డంపింగ్ వాహనాల అడ్డగింత

డంపింగ్ యార్డులో గ్రామస్తులు

పాల్వంచ, నవంబర్ 23: స్థానిక ముర్రేడును ఆనుకుని ఉన్న ఎస్సీ శ్మశాన వాటిక ప్రాంతాన్ని డంపింగ్ యార్డుకు మున్సిపల్ అధికారులు ఇటీవల కేటాయించారు. దీనిని నిరసిస్తూ, వ్యర్థాలతో వచ్చిన వాహనాలను ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారు శనివారం పాత పాల్వంచ బంగారు జాల వద్ద అడ్డుకున్నారు. అక్కడే రోడ్డుపై టెంట్ వేసి అందులో కూర్చున్నారు. దీనిపై మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు స్పందించారు. మున్సిపల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ ఫరీద్, పారిశుధ్య అధికారి లక్ష్మణ్ నుంచి వివరాలు తెలుసుకున్నారు. కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడారు.

సీపీఎం మండల కార్యదర్శిగా బత్తుల

బూర్గంపహాడ్, నవంబర్ 23: సారపాకలో శుక్రవారం జరిగిన సీపీఎం సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏజె రమేశ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎంబీ నర్సారెడ్డి సమక్షంలో బూర్గంపహాడ్ మండల నూతన ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా బత్తుల వెంకటేశ్వర్లుతో పాటు 11 మందిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పాండవుల రామనాథం, రాయల వెంకటేశ్వర్లు, పాపినేని సరోజిని, ఎస్కే అబిదా, బయ్యా రాము, కనకం వెంకటేష్, గుంటుక కృష్ణ, దామోదరరెడ్డి, కందుకూరి నాగేశ్వరరావు, బండారు రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితురాలికి ఆర్థిక సాయం

భద్రాచలం, నవంబర్ 23: పట్టణంలోని సుభాశ్‌నగర్ కాలనీకి చెందిన క్యాన్సర్ బాధితురాలు జీ అనూషకు వసుధ ఫౌండేషన్ బాధ్యులు శనివారం రూ.10వేల చెక్కును వసుధ ఫౌండేషన్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ వేగేశ్న శ్రీనివాసరాజు, సభ్యుడు పీవీ సత్యనారాయణ అందజేశారు. అనూష వైద్యఖర్చుల నిమిత్తం ఆర్థికసాయం అందించాలని వసుధ ఫౌండేషన్‌ను ఆశ్రయించగా చైర్మన్ వెంకటరామరాజు సానుకూలంగా స్పందించి నగదు మంజూరు చేశారు.

తాటిచెట్టుపై నుంచి పడి వ్యక్తికి గాయాలు

ఆళ్లపల్లి, నవంబర్ 23: తాటిచెట్టుపై నుంచి ఓ వ్యక్తి కిందపడి గాయాలపాలైన ఘటన శనివారం మండలంలోని మర్కోడు గ్రామంలో చోటుచేసుకుంది. మర్కొడు గ్రామం డబుల్‌బెడ్ రూంలో నివాసముంటున్న కాంతారావు రఘువాపురం పంచాయతీ కర్నెగూడెంలో ప్రతిరోజు లాగానే కల్లు తీయటానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి పడి తలకు, ఎడమకాలుకు గాయాలయ్యాయి. స్థానిక పీహెచ్‌సీలో ప్రథమచికిత్స చేసి,మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి పంపామని డాక్టర్ సంఘమిత్ర తెలిపారు.

జిల్లాస్థాయి సబ్ జూనియర్ చాంపియన్ షిప్ పోటీలు

పాల్వంచ, నవంబర్ 23: స్థానిక శ్రీనివాస కాలనీ మినీ స్టేడియంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సబ్ జూనియర్ చాంపియన్‌షిప్ పోటీలు శనివారం జరిగాయి. బాల బాలికల అండర్-8 విభాగంలో 50 మీటర్లు, వంద మీటర్ల పరుగు, స్టాండింగ్ బోర్డు జంప్; అండర్-10 విభాగంలో 100, 300 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్; అండర్-12 విభాగంలో 100, 400, 600 మీటర్ల పరుగు; లాంగ్ జంప్, షాట్‌పుట్ పోటీలు జరిగాయి.

వెంకటనారాయణకు నివాళి

పాల్వంచ, నవంబర్ 23: కేటీపీఎస్ బీసీ అసోసియేషన్ వ్యవస్థాపకుడు దొంతరబోయిన వెంకటనారాయణ 20వ వర్ధంతిని అసోసియేషన్ హాల్‌లో నాయకులు శనివారం నిర్వహించారు. చిత్రపటానికి జెన్‌కో ప్రెసిడెంట్ కొమరవెల్లి రవీందర్ తదితరులు పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. హరికృష్ణ, అశోక్‌బాబు, లింగం వినోద్‌బాబు, వెంకటేశ్వర్లు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

'చిల్లర' వ్యాపారులకు జరిమాన

టేకులపల్లి, నవంబర్ 23: ఇల్లెందు మార్కెట్ యార్డ్ అనుమతి లేకుండా చిల్లర కౌంటర్లు నిర్వహిస్తున్న, పత్తి కొనుగోలు చేస్తున్న వ్యాపారులకు ఇల్లెందు మార్కెట్ గ్రేడ్-3 కార్యదర్శి నరేష్ శనివారం చైర్మన్ బానోత్ రాంబాబు ఆధ్వర్యంలో జరిమాన విధించారు. లైసెన్స్ లేకుండా పత్తి, ధాన్యం క్రయవిక్రయాలు సాగిస్తే చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు

మాట్లాడుతున్న డాక్టర్ షేక్ మీరా

చుంచుపల్లి, నవంబర్ 23: ప్రకృతి వ్యవసాయంపై చుంచుపల్లిలో శనివారం రైతు సదస్సును కృషి విజ్ఞాన కేంద్రం నిర్వహించింది. ఏటీఏ ఆర్ఐ జోన్-10 డైరెక్టర్ డాక్టర్ షేక్ మీరా మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మళ్లాలని పిలుపునిచ్చారు. తెలంగాణ సమన్వయ విస్తరణ సంచాలకుడు డాక్టర్ ఆర్.ఉమారెడ్డి, కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ వి.లక్ష్మీనారాయణమ్మ, శాస్త్రవేత్తలు డాక్టర్ నవీన్‌కుమార్, డాక్టర్ శ్రీనివాస్, బి.శివ పాల్గొన్నారు.

టాలెంట్ టెస్టులో ఎక్సలెంట్ విద్యార్థుల ప్రతిభ

మణుగూరు టౌన్, నవంబర్ 23: మణుగూరులోని జిల్లా పరిషత్ పాఠశాలలో మండల స్థాయి టాలెంట్ టెస్టు నిర్వహించారు. ఇంగ్లీస్ మీడియంలో స్థానిక ఎక్సలెంట్ పాఠశాల విద్యార్థులు వేణు, రిధ, సజ్జద్ ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని పాఠశాల చైర్మన్ యూసుఫ్ షరీఫ్, డైరెక్టర్లు ఖాదర్, యాకూబ్ షరీఫ్ అభినందించారు.

భద్రాద్రి రామయ్యకు స్వర్ణ తులసి పూజలు

స్వామివారికి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

భద్రాచలం, నవంబర్ 23: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో స్వామివారి ఉత్సవమూర్తులకు శనివారం అర్చకులు స్వర్ణతులసి పూజలు జరిపారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యబలిహరణం తదితర నిత్యపూజలు చేశారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణమూర్తులను బేడా మండపానికి తీసుకువచ్చి నిత్యకల్యాణం జరిపారు. కల్యాణంలో పాల్గొన్న దాతలకు ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

'టెన్త్' విద్యార్థులను ప్రతి టీచర్ దత్తత తీసుకోవాలి

జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరాచారి

మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వరాచారి

భద్రాచలం, నవంబర్ 23: టెన్త్ విద్యార్థులను ప్రతి టీచర్ దత్తత తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరాచారి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ప్లానింగ్ కోఆర్డినేటర్ ఎన్ సతీశ్‌కుమార్‌తో కలిసి తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరును ప్రతిరోజూ నమోదు చేయాలని, ఏపీఏఏఆర్ కార్డు జనరేట్ చేయాలని తెలిపారు. ప్రతి ఒక్క టీచరు పది విద్యార్థులను దత్తత తీసుకుని ఆ జాబితాను వెంటనే జిల్లా కార్యాలయానికి పంపాలన్నారు. ఈ ఏడాది 10వ తరగతి విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పదోతరగతి విద్యార్థులను దత్తత తీసుకోవాలి

కొత్తగూడెం ఎడ్యుకేషన్, నవంబర్ 23: పదోతరగతి విద్యార్థులను ఉపాధ్యాయులంతా దత్తత తీసుకోవాలని డీఈవో వెంకటేశ్వరాచారి కోరారు. భద్రాచలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన శనివారం సందర్శించారు. ప్లానింగ్ కో-ఆర్డినేటర్ సతీష్‌కుమార్‌తో కలిసి ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థుల ముఖ గుర్తింపు హాజరును ప్రతి రోజూ నమోదు చేయాలన్నారు. ఈ ఏడాది పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

పంచాయతీ ఎన్నికల్లో గెలుపు కోసం కృషిచేయాలి

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేతలు

మణుగూరు టౌన్, నవంబర్ 23: రానున్న పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం అందరూ కృషిచేయాలని బీఆర్ఎస్ మణుగూరు మండల కన్వీనర్ కుర్రి నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని పగిడేరు గ్రామంలో జరిగిన గ్రామస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. వార్డు మెంబర్ల నుంచి సర్పంచ్‌ల వరకు పార్టీ తరపున నిల్చున్న ప్రతీ అభ్యర్థిని గెలిపించాలన్నారు. గ్రామస్థాయి కమిటీలు కార్యకర్తల అభీష్టం మేరకే నిర్ణయించబడతాయని అన్నారు. సమావేశంలో మణుగూరు టౌన్ కన్వీనర్ కుంట లక్ష్మణ్, కో కన్వీనర్ నూకారపు రమేశ్, నాయకులు ముద్దంగుల కృష్ణ, ఆవుల నరసన్న, తురక రామకోటి, అక్కి నర్సింహారావు, ముద్వా రాంబాబు, ప్రసాద్ పాల్గొన్నారు.

5న బీఆర్ఎస్ సమావేశం

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకుడు

దుమ్ముగూడెం, నవంబర్ 23: డిసెంబర్ 5న జరిగే బీఆర్ఎస్ మండల జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయాలని బీఆర్ఎస్ మండల కన్వీనర్ కణితి రాముడు పిలుపునిచ్చారు. శనివారం లక్ష్మీనగరం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అబద్దపు హామీలు, మోసపూరిత వాగ్దానాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలుచేయడంలో విఫలమైందని ధ్వజమెత్తారు. కనీసం బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన సంక్షేమ పథకాలను కూడా అమలు చేయలేదని విమర్శించారు. ప్రజల్లో ప్రభుత్వం పట్ల తీవ్ర వ్యతిరేకత మొదలైందని, బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు ప్రజలను చైతన్యం చేసి పార్టీ అభివృద్ధికి కృషిచేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు కోసం కృషిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ ఎదుగుదల కోసం దిశానిర్దేశం చేసేందుకు డిసెంబర్ 5న మండలంలో జరగనున్న జనరల్ బాడీ సమావేశానికి అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో మండల కోకన్వీనర్ జానీపాషా, మాజీ ఎంపీపీ రేసు లక్ష్మి, పీఏసీఎస్ డైరెక్టర్‌లు బొల్లి వెంకట్రావు, కాలువ పూర్ణయ్య, నాయకులు తునికి కామేశ్, కొత్తూరు సీతారామారావు, వాగి వెంకటేశ్వరరావు, దామెర్ల శ్రీనివాసరావు, కొత్తా మల్లేశ్వరరావు, కణితి లక్ష్మణుడు, రావులపల్లి పృథ్వీ, నోముల రామిరెడ్డి, కొర్సా నర్సింహారావు, సోయం నర్సింహారావు పాల్గొన్నారు.

విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం కావాలి

దుమ్ముగూడెం, నవంబర్ 23: విద్యార్థులు రాబోయే పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం కావాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి అన్నారు. శనివారం దుమ్ముగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన పేరెంట్, టీచర్ మీటింగ్‌లో ఆమె మాట్లాడారు. విద్యార్థుల ఆరోగ్యానికి సంబంధించి తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వారిని సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంచాలని, రాబోయే పరీక్షల్లో ఎలా చదువుతున్నారో గమనించాలని సూచించారు. పరీక్షల చివరి సమయంలో ప్రణాళికాబద్ధంగా చదివి వత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఫుడ్ ఫెస్టివల్

ఫుడ్ ఫెస్టివల్‌లో పాల్గొన్న మహిళలు

చర్ల, నవంబరు 23: కార్తీక మాసం సందర్భంగా శ్రీవాణి విద్యానికేతన్‌లో శనివారం విద్యార్థుల తల్లి దండ్రులకు ఫుడ్‌ఫెస్టివల్‌లో భాగంగా వంటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో 54 పాఠశాలకు చెందిన విద్యార్థుల తల్లులు పాల్గొన్నారు. కార్యక్రమానికి న్యాయనిర్ణేతలుగా చర్ల ప్రభుత్వ జూనియర్ కాళాశాల ప్రిన్స్‌పాల్ ఎన్ నరేందర్, కొయ్యూరు పీహెచ్‌సీ హోమియో వైద్యురాలు పూజ, తుమ్మల రమ వ్యవహరించారు. ప్రిన్స్‌పాల్ నరేందర్ మాట్లాడుతూ కార్తీకమాసంలో విద్యాసంస్థలో పిల్లల తల్లిదండ్రులకు ఇటువంటి కార్యక్రమం నిర్వహించిన హెచ్‌ఎం మైనేని పద్మజను అభినందించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

మోడల్ మార్కెట్‌లో అర్హులందరికీ గదులు

ఇల్లెందు, నవంబర్ 23: ఇల్లెందులోని మోడల్ మార్కెట్‌లో అర్హులందరికీ గదుల కేటాయింపు పారదర్శకంగా ఉంటుందని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అన్నారు. ప్రారంభానికి సిద్ధమైన మోడల్ మార్కెట్ గదుల కేటాయింపుపై స్థాయి అయితా ఫంక్షన్ హాల్‌లో దమ్మలపాటి అధ్యక్షతన శనివారం స్థానిక వ్యాపారుల సమావేశం జరిగింది. వ్యాపారులు మాట్లాడుతూ.. మార్కెట్‌ను నమ్ముకుని గతం నుంచి వ్యాపారం చేస్తున్న వారికి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. వెజ్-నాన్ వెజ్ మార్కెట్లు వేర్వేరుగా ఏర్పాటు చేయాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, మేనేజర్ అంకుర్ షావలి, కౌన్సిలర్లు రవి, అజాం, నవీన్, రవీందర్, పద్మావతి, తార, నాగలక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.